RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 348 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 20 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# 'లోకల్' రూట్లో కేబినెట్ విస్తరణ!

## అన్ని సామాజిక వర్గాలు, ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా సీఎం రేవంత్ ఉండేలా కసరత్తు

### ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కనున్న బెర్తులు.. రెడ్డి, వెలమలకూ చాన్స్ దీనితో ప్రస్తుత మంత్రుల్లో ఒకరిద్దరిని తొలగించవచ్చనే చర్చ




హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గంలో మార్పుచేర్పులకు రంగం సిద్ధమవుతోంది. కీలక ఎన్నికలన్నీ ముగియడం, కేబినెట్‌లో బెర్తులు ఖాళీ ఉండటం నేపథ్యంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేపట్టవచ్చని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా.. అన్ని జిల్లాలు, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉంటాయని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్టు నాటికి విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలిసింది. ప్రస్తుతం సీఎం రేవంత్ సహా 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురిని కేబినెట్‌లోకి తీసుకునేందుకు వీలుంది. ఈ మేరకు కేబినెట్ కూర్పుపై సీఎం రేవంత్ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. ప్రస్తుతమున్న మంత్రుల్లో ఒకరిద్దరిని తొలగించవచ్చనే చర్చ జరుగుతోంది. దీనికితోడు ప్రస్తుతం సీఎం వద్ద ఉన్న పలు కీలక శాఖలను పంపిణీ చేసే క్రమంలో.. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇటీవల సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై అధిష్టానంతో చర్చించినట్లు తెలుస్తోంది.

**పాలన, పట్టు.. రెండింటిపై ఫోకస్‌తో..** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక 12 మంది మంత్రులతోనే పరిపాలన కొనసాగుతోంది. కొన్ని కీలక శాఖలు ఇంకా సీఎం రేవంత్ వద్దనే ఉన్నాయి. గత ఐదు నెలల్లో మూడు నెలల పాటే పాలన సజావుగా సాగింది. రెండు నెలలకు పైగా ఎన్నికల కోడ్‌తోనే గడిచిపోయింది. పాలన విషయంలో పలు రకాల సమస్యలు అటు సీఎం, ఇటు కేబినెట్ దృష్టికి వచ్చాయి. ఈ క్రమంలో మంత్రివర్గ విస్తరణతో త్వరలో పూర్తిస్థాయి పరిపాలన మొదలుపెట్టాలనే యోచనలో సీఎం రేవంత్ ఉన్నారని తెలిసింది. ప్రస్తుతం కీలక ఎన్నికలన్నీ ముగిశాయి. లోక్‌సభతోపాటు పలు ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు, తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరగాలి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. కొన్ని ఉమ్మడి జిల్లాలకు కేబినెట్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఈ 'స్థానిక' ఎన్నికల సందర్భంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. పలు సామాజిక వర్గాలకు కేబినెట్లో స్థానం లేకపోవడం కూడా 'స్థానిక' ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చని నేతలు అంటున్నారు. కేబినెట్ విస్తరణతో ఈ ఇబ్బందులు తీరుతాయని పేర్కొంటున్నారు.

**కొందరు మంత్రుల పనితీరుపై అసంతృప్తి! :** లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొందరు మంత్రుల పనితీరుపై అధిష్టానం అసంతృప్తితో ఉందన్న చర్చ జరుగుతోంది. కొందరు మంత్రులు ఇన్‌చార్జులుగా ఉన్న నియోజకవర్గాల్లో సరిగా పనిచేయకపోవడం, చాలా మంది మంత్రుల నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ ఓట్లు రావడం వంటి అంశాలు నివేదికల రూపంలో అధిష్టానానికి చేరినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో స్వల్పంగా ఓట్లు తక్కువగా వచ్చినప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన తీరు, రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తడంపై అధిష్టానం మన్ననలు పొందినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

**'చాన్స్'పై సామాజిక వర్గం, జిల్లాలవారీ లెక్కలు! :** రాష్ట్ర కేబినెట్ నుంచి ఒకరిద్దరికి ఉద్వాసన ఉండవచ్చన్న ప్రచారం జరుగుతున్నా టీపీసీసీ నుంచి ఎలాంటి స్పష్టత రావడం లేదు. మంత్రులుగా నియామకమై చాలా తక్కువ సమయమే కావడంతో ఎవరి పనితీరు ఏమిటనేది అంచనా వేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది. కానీ ఒకరిద్దరు మంత్రుల వ్యవహారశైలిపై అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయన్న ప్రచారమూ ఉంది. మరోవైపు మంత్రివర్గంలోకి కొత్తగా ఎవరు వస్తారన్న దానిపై మాత్రం ఆసక్తి నెలకొంది. కేబినెట్ ప్రస్తుత కూర్పును బట్టి.. కొన్ని ఉమ్మడి జిల్లాలు, కొన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాల్సి ఉంది. అందులో ఎస్సీ (మాదిగ), ఎస్టీ (లంబాడా), బీసీ (ముదిరాజ్)లకు బెర్త్ ఖాయమని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. పెద్ద బీసీ సామాజిక వర్గాల్లో ఒకటైన మున్నూరు కాపులకు కేబినెట్ చాన్స్ రాలేదు. కొండా సురేఖ ఉన్నా ఆమెను పద్మశాలి కోటాలోనే లెక్క వేస్తున్నారు. ఈ క్రమంలో మున్నూరుకాపులకు విస్తరణలో చాన్స్ ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇక కేబినెట్‌లో ముదిరాజ్‌లకు అవకాశమిస్తామని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో ఆ వర్గానికి బెర్త్ దక్కే చాన్స్ ఉంది. ఇతర వర్గాల విషయానికి వస్తే రెడ్డి ఎమ్మెల్యేల్లో ఒకరికి చాన్స్ ఉంటుందని అంటున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వకుంటే వెలమ వర్గాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు చెప్తున్నారు. వెలమ కోటాలో ముగ్గురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి కేబినెట్‌లో ఎవరికి స్థానం దక్కలేదు. ఇప్పటికే ఇక్కడ పార్టీ బలహీనంగా ఉండటం, రాష్ట్రానికి గుండెకాయ వంటి ప్రాంతానికి కేబినెట్లో ప్రాతినిధ్యం లేకపోవడం నష్టమన్న అంచనాలో పార్టీ ముఖ్యులు ఉన్నారు. దీనితో గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి ఒకరికి కేబినెట్ చాన్స్ రావొచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కేబినెట్ కూర్పులో స్థానం దక్కని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కూడా ఈసారి ప్రాతినిధ్యం కల్పిస్తారని నేతలు చెప్తున్నారు. ఎవరికి చాన్స్ దక్కుతుందన్నదానిపై స్పష్టత లేకపోయినా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి లేదా వెలమ, జీహెచ్ఎంసీ, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల కోటా లెక్కల్లోనే కేబినెట్ విస్తరణ ఉంటుందని చర్చ జరుగుతోంది.

---

**కరీంనగర్: స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపామని, నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదే విధంగా నగరంలో నిర్మించిన పలు జంక్షన్లకు కావాలనే అంచనాలు పెంచి అవినీతికి పాల్పడ్డారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో వివిధ శాఖలపై బుధవారం పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పనుల్లో పారదర్శకత పాటించకపోతే కాంట్రాక్టర్లను వదిలిపెట్టేదిలేదని హెచ్చరించారు. త్వరలోనే కరీంనగర్ స్మార్ట్ సిటీ అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోబోతున్నామని మంత్రి తెలిపారు. గతంలో జరిగిన పనులపై ఫిర్యాదులు ఉన్నాయని వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.**




## హజ్ యాత్రలో మృత్యుఘోష

### ఈ ఏడాది 550 మంది యాత్రికులు మృతి..!

ముస్లింల పవిత్ర హజ్ యాత్ర ముగింపు దశకు చేరుకుంది. అయితే, ఈ సారి ఈ పవిత్ర యాత్ర మృత్యుఘోషగా మారింది. ప్రస్తుతం సౌదీ అరేబియాలో ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో ఉష్ణతాపానికి హజ్ యాత్రికులు అల్లాడిపోతున్నారు. ఎక్కడికక్కడ పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండ వేడికి తాళలేక ఇప్పటి వరకూ 550 మంది హజ్ యాత్రికులు మరణించినట్లు అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. మరణించిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికంగా ఉన్నట్లు తెలిపారు. సుమారు 323 మంది ఈజిప్టియన్లు కాగా, 60 మంది జోర్డానియన్లు మరణించినట్లు తెలిపారు. ఈ యాత్రలో చనిపోయిన వారి సంఖ్య 577కి చేరినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. తీవ్ర ఎండలు, ఉక్కపోత వాతావరణమే అందుకు కారణంగా తెలిపారు. మక్కాలో ప్రస్తుతం 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సారి యాత్రలో దాదాపు 18.3 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో 22 దేశాలకు చెందిన 16 లక్షల మంది ఉన్నట్లు సౌదీ హజ్ నిర్వాహకులు వెల్లడించారు. ఎండ తీవ్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉపశమనం కలిగించడం లేదని అధికారులు పేర్కొన్నారు. మక్కాలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన అల్-ముయిసెమ్ ఆసుపత్రిలో మృతదేహాలను ఉంచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, గతేడాది హజ్ యాత్రలో 240 మంది యాత్రికులు చనిపోయారు. వారిలో చాలా మంది ఇండోనేషియాకు చెందిన వారే ఉన్నట్లు సౌదీ మీడియా తెలిపింది.

---


# డీజీపీ మార్పుపై ఉత్కంఠ!

## రేసులో ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్

### ఈ ఏడాది చివరిలో శివధర్‌రెడ్డికి చాన్స్? - వారంలోపే సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు!

హైదరాబాద్ : రాష్ట్రంలో డీజీపీని మార్చుతారనే చర్చ జోరుగా సాగుతున్నది. నెక్స్ట్ పోలీస్ బాస్ ఎవరనే ఉత్కంఠ పోలీసువర్గాల్లో మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ బదిలీల్లో డీజీపీగా నియమితులైన రవిగుప్తాకే కొత్త ప్రభుత్వం పూర్తి బాధ్యతలు ఇచ్చింది. ఇటీవల రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పడం, ఎక్కడ చూసినా చైన్‌స్నాచింగ్ ముఠాలు, దోపిడీ గ్యాంగులు హల్‌చల్ చేస్తుండటం, నడిరోడ్లపైనే హత్యలు జరుగుతుండటంతో డీజీపీ మార్పు అనివార్యంగానే కనిపిస్తున్నట్టు పోలీసువర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికిప్పుడు డీజీపీని మార్చితే.. డీజీ హోదా కలిగిన జితేందర్ ఐపీఎస్‌కు అవకాశం ఉన్నదని అంటున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ ఏసీబీని ఓ గాడిలో పెట్టడంతో ఆయన్నే ఏసీబీ డీజీగా కొనసాగిస్తారని చెప్తున్నారు.

1990 బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్ ఇప్పటికే డీజీపీగా చేయడం, అదే బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా డీజీపీగా కొనసాగుతుండటం, 1991వ బ్యాచ్‌కు చెందిన రాజీవ్రతన్ గుండెపోటుతో చనిపోవడంతో 1992వ బ్యాచ్‌కు చెందిన జితేందర్ డీజీపీగా నియమిస్తారనే చర్చ కొనసాగుతున్నది. 1993వ బ్యాచ్‌కు చెందిన సందీప్‌శాండిల్య ఇటీవల పదవి విరమణ పొందటం, 1994 బ్యాచ్‌కు చెందిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సీపీగా ఉ



ండగా, సౌమ్యమిశ్రా జైళ్లశాఖ డీజీగా, శివధర్‌రెడ్డి ఇంటెలిజెన్స్ డీజీగా, శిఖాగోయెల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐడీగా, ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీగా, అభిలాష బిస్త్ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వీరికి ఇంకా డీజీపీ హోదా రాకపోవడంతో సీనియర్ అయిన జితేందర్, సీవీ ఆనంద్‌కే డీజీపీ అవకాశం ఎక్కువగా ఉన్నట్టు పోలీసువర్గాలు చెప్తున్నాయి. వీరిద్దరిలో ఎవరినో ఒకరిని డీజీపీగా నియమించినా.. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది త్రైమాసికంలోనే డీజీపీగా శివధర్‌రెడ్డిని నియమిస్తారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. వారంలోపే సీనియర్ ఐపీఎస్‌లకు సైతం స్థానచలనం కల్పించనున్నట్టు తెలిసింది.

# గులాబీ గూటి నుండి... ఒకే ఒక్కడు...!

## ప్రజా సమస్యలపై గొంతెత్తున్న ట్రబుల్ షూటర్..

హైదరాబాద్ : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎలాంటి సమస్య వచ్చినా స్పందిస్తున్నారు. ప్రజలకు అండగా నిలుస్తున్నారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా రుణ మాఫీపై ప్రభుత్వాన్ని నిలదీశారు. పింఛన్ రూ. 4వేలు ఎప్పుడు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీపై హరీశ్ రావు మాట్లాడుతున్నారు. జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. గ్రూప్-1 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ అవకాశం కల్పించాలన్నారు. ఆరు నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తాజాగా ఇంటర్ విద్యార్థుల సమస్యలపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఇంటర్ తరగతులు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద విద్యార్థులు చదువుతున్నారని.. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. "రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా, ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం బాధ్యతారాహిత్యం. ప్రజా పాలన అని ప్రచారం చేసుకునే ఈ ప్రభుత్వానికి విద్య మీద, విద్యార్థుల భవిష్యత్తు మీద ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. 422 జూనియర్ కాలేజీల్లో లక్షా 60 వేల మంది



పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైంది" అని హరీశ్ రావు ట్వీట్ చేశారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో మొదటి ఏడాది జీరో అడ్మిషన్స్ నమోదవడం పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, జూనియర్ కాలేజీల్లో విధులు నిర్వర్తించే 1654 గెస్ట్ ఫ్యాకల్టీ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పట్టు బిగిస్తున్న ఆర్ఎస్ఎస్

## ఈ ప్రచ్ఛన్నయుద్ధపు ముగింపేమిటో.?

మొక్కను.. కంకి భారమౌతుందా? కాయ.. చెట్టునే బేఖాతర్ అంటుందా? దశాబ్దాలుగా గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న ఓ ఇంటి వ్యవహారం ఇప్పుడు రచ్చకెక్కింది. భారతీయ జనతా పార్టీ దాని సిద్ధాంత భూమికైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మధ్య అభిప్రాయ భేదాలు పొడచూపాయా? తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. ఇదేం సిద్ధాంత రాద్ధాంతం కాదు. విధానాల ఆచరణ, వ్యవహారశైలి వంటి అంశాలే ఇందుకు కారణం. ఏడాదిలో ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధ మౌతున్న సంఘ్ అదే యేట 75 ఏండ్లు నిండే మోదీని 'ఇక చాలించండి' అని నాయకత్వ మార్పును ప్రతిపాదిస్తుందా? ఈ ప్రచ్ఛన్నయుద్ధం ఏ (వి)పరిణామాలకు దారితీస్తోంది? ఇవన్నీ ప్రశ్నలే! ఇప్పుడిదే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం. నా గ్పూర్‌లో 1988 అక్టోబరు 23–25 తేదీల్లో జరిగిన ఆర్ఎస్ఎస్ విస్తృత కార్యకర్తల సమావేశంలో దత్తోపంత్ ఠేంగ్డే మాట్లాడుతూ 'నాలో ఎన్నో అవలక్షణాలుండొచ్చు, కానీ, రొమాంటిసిజం మాత్రం లేదు' అని సగర్వంగా అన్నారు. అంతగా మునుగున్నట్లు చెప్పటం ఇప్పుడవసరం లేదనుకున్నారేమో. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ అదే నాగ్పూర్‌లో జరిగిన కార్యకర్తల శిక్షణా శిబిరంలో ఇటీవల మాట్లాడుతూ 'నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు. నేనే చేశానని చెప్పుకోడు. ప్రజాజీవితంలో గౌరవ మర్యాదలు పాటిస్తాడు' అని పచ్చిగానే చెప్పారు. మరి, ఆయనన్నట్టు సేవకుడినని చెప్పుకుని, అహంకారంతో, గౌరవ మర్యాదలు పాటించనిదెవరు? పలు నిర్వేతుక నినాదాలతో రొమాంటిసిజాన్ని ప్రదర్శిస్తున్నదెవరు? ఆయనెవరో పేరు వేరే చెప్పాలా! ఆర్ఎస్ఎస్ అధికార మాటలు గాని, సంఘ్ గొంతుక 'ఆర్గనైజర్'లో అచ్చయిన జీవితకాలపు కార్యకర్త రతన్ శారద వ్యాసంగానీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**బీజేపీ – ఆర్ఎస్ఎస్ మధ్య విభేదాలు :** 18 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అని చెప్పుకునే బీజేపీకి, దాని సిద్ధాంత భూమిక అయిన ఆర్ఎస్ఎస్‌కు మధ్య విభేదాలున్నాయని, బీజేపీ అగ్రనాయకత్వం వ్యవహార శైలి, పార్టీ నడకతీరుపై ఆర్ఎస్ఎస్ గుర్రుగా ఉంది. అంతకు ముందు నుంచే స్పర్థలు ఉన్నా ఎన్నికల సందర్భంగా కొన్ని విషయాల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య తేడాలు బయటపడ్డాయి. అందుకే, పార్టీ విధానాల అమలుపై మరింత పట్టుకోసం ఆర్ఎస్ఎస్ ఇప్పటికే 'దిద్దుబాటు' చర్యలు ప్రారంభించిందనీ చెబుతున్నారు. బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా, పార్టీకి పూర్వవైభవం దక్కలేదు. భారీ మెజారిటీ అని ప్రచారం చేసుకున్నా కనీస మెజారిటీకి అవసరమైన సంఖ్యా కూడా సొంతంగా రాక బీజేపీ బలం 240 స్థానాలకు తగ్గిపోయింది.

**సంఘ్, బీజేపీ మధ్య ఆధిపత్య పోరు :** వ్యక్తి కేంద్రకంగా జరిపిన ప్రచారం, 'రొమాంటిసిజం'తో చేసిన నినాదాలు, అంతటా కనబడిన అతి విశ్వాసం ఒకవైపు, అలసత్వం మరోవైపు బీజేపీ కొంప ముంచిందని ఆర్ఎస్ఎస్ బలంగా నమ్ముతోంది. ఇదిలాగే సాగుతుంటే మంచిది కాదని, పార్టీపై ప్రత్యక్ష పట్టు, పాలనపై పరోక్ష అదుపు సడలనీకుండా మరింత పెంచాలని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నట్టు సంకేతాలున్నాయి. ఈసారి కేంద్ర మంత్రివర్గ కూర్పులోనే కాకుండా శాఖల కేటాయింపుల్లోనూ ఆర్ఎస్ఎస్ తనదైన ముద్ర వేసింది. ఈ పోకడ ఇలాగే కొనసాగితే, వచ్చే ఏడు ప్రధాని మోదీకి 75 ఏండ్లు నిండినప్పుడు..'మీ పిలుపు నకు మీరే కట్టుబడండి, 75 ఏండ్ల వృద్ధులయ్యారు ఇక తప్పుకోండి' అని గుమ్మం చూపిస్తారా? కేంద్ర ప్రభుత్వంలో నెంబర్‌ 2, మోదీ అంతేవాసి అమిత్‌షా కాదని చెప్పడం సంఘ్ లక్ష్యమై ఉంటుందా? ఇవే రాజకీయ వర్గాల్లో చర్చకొస్తున్నాయి. ఒకటి మాత్రం నిజం, అటు బీజేపీ ఇటు ఆర్ఎస్ఎస్, అవకాశాన్ని బట్టి ఆధిపత్య సాధనకు యత్నిస్తున్నట్టు తేటతెల్లమవుతోంది.

**రాహుల్ బలోపేతం..మోదీ బలహీనం :** ఈ ఎన్నికల్లో కాంగ్రెస్? ఓడినా రాహుల్ బలపడ్డారు. ఎన్నిక గెలిచినా మోదీ బలహీనమయ్యారు. ఇదివరకటి చరిష్మా ఆయనలో కనిపించడంలేదు. లక్ష్యం నెరవేరింది కనుక మోదీ 'పరివార్' అనే మాటను ఇక తొలగించండి అని ఆయనే చెబుతున్నారు. ఈ తొలగింపు ప్రక్రియ కూడా ఆర్ఎస్ఎస్? గుర్రు వల్లే అంటున్నారు. 'ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్' మోదీ గ్యారెంటీ వంటి నినాదాల పట్ల, పార్టీలో వ్యక్తిస్వామ్యం పెరగటం పట్ల ఆర్ఎస్ఎస్? కోపానికి కారణాల్లో ఒకటి. మోహన్ భాగవత్ నాగ్‌పూర్‌లో చాలా విషయాలే తెరపైకి తెచ్చారు. రాజకీయాల్లో విపక్షాలే తప్ప వైరి పక్షాలుండవని, పరస్పర గౌరవ మర్యాదలు లోపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**సంఘ్ సహకారం కోరని బీజేపీ ? :** ఆర్ఎస్ఎస్ సరిగా పనిచేయలేదనే ఆరోపణ పసలేనిది, స్థానికంగా ఎక్కడికక్కడ ఆర్ఎస్ఎస్, ఇతర విభాగాల సహాయ -సహకారాలు కోరని బీజేపీ నాయకత్వాన్నదే తప్పని, ప్రత్యేక పరిస్థితుల్లో 1973,– 77లో తప్ప ఆర్ఎస్ఎస్? ఎప్పుడూ ప్రత్యక్షంగా ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనలేదని, పౌరులు విస్తృతంగా ఓటింగ్‌లో పాల్గొనాలనే ప్రచారం ఇటీవల చేసిందని రతన్ శారద ఆర్గనైజర్‌లో రాశారు. 10x15 మందితో కూడిన చిన్న బృందాలు, దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షలకు తగ్గకుండా ఈసారి వీధి మలుపు, ఆఫీసు, ప్రయివేటు ప్రాంగణ సమావేశాలు జరిపాయని గుర్తు చేశారు. జాతీయ సమగ్రతకు నిబద్ధ జాతీయవాద శక్తులకు మద్దతీయాలనే కోరిందన్నారు. 543 స్థానాల్లోనూ 'మోదీ'యే పోటీ చేస్తున్నారన్నంత భ్రమ కల్పించడం తప్పని, బీజేపీ మంత్రులే కాదు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు దొరకని పరిస్థితి ఏంటని 'ఆర్గనైజర్' ఎండగట్టింది.

**తెలంగాణలో ఇకో నాలుగు సీట్లొచ్చేవి :** మొదటి నుంచి పార్టీకి కట్టుబడ్డ నిబద్ధులకే టికెట్లు ఇచ్చి ఉంటే, తెలంగాణలో మరో నాలుగు సీట్లయినా వచ్చి ఉండేవనే భావన పాతతరం నాయకులకు ఉంది. కనీసం 12 సీట్లు గెలవాల్సిన ఊపువచ్చి, 8 స్థానాలకే పరిమితమయ్యామనే బాధ కొందరు వ్యక్తం చేస్తున్నారు. 17 లోకసభ స్థానాలకుగాను 15 చోట్ల ఇతర పార్టీల (10 బీఆర్ఎస్, 3 కాంగ్రెస్) నుంచి వచ్చినవారికే, కార్పొరేట్ ప్రతినిధులకే ఇచ్చారనే బాధ పార్టీ శ్రేణుల్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే జరిగిందని వృద్ధ పార్టీ శ్రేణుల్లో నెలకొంది! జహీరాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్, నల్గొండ తదితర లోక్‌సభ స్థానాల్లో వలస పక్షులకు కాక పార్టీకోసం ఎంతోకాలంగా పనిచేసేవారికే ఇచ్చి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని కొందరంటారు. తాజా ఫలితాలతో ప్రజలు బీజేపీకి తప్పులు దిద్దుకునే ఒక అవకాశం ఇచ్చారన్నది వారి భావన.

**అతివిశ్వాసం, అలసత్వం :** బీజేపీలో పెరిగిన అతివిశ్వాసానికి, అలసత్వానికి ఇటీవల ఫలితాల రూపంలో వాస్తవ పరిస్థితులే గుణపాఠం నేర్పాయని సంఘ్ సీనియర్, జీవితకాలపు కార్యకర్త రతన్ శారద చురక అంటించారు. బీజేపీ నడక ఎలా దారితప్పిందో సవివరంగా, సంఘ్ గొంతుకైన 'ఆర్గనైజర్' పత్రికలో ఆయనొక సమగ్ర వ్యాసం రాశారు. చాలా విషయాలు నిర్మొహమాటంగానే వ్యక్తం చేశారు. అవి, ఆర్ఎస్ఎస్‌కు చెందిన అత్యధికులు గత కొంతకాలంగా మాట్లాడుకుంటున్న విషయాలే! 'వారిద్దరూ మా మనసులోని మాట చెప్పారు' అని దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి.

# అధ్వాన దారులు.. అవస్థల ప్రయాణాలు



తాండూరు: జిల్లాలో రహదారులు, భవనాలశాఖ ప్రధాన రోడ్లతో పాటు పల్లెలకు అనుసంధానంగా ఉన్న పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు నిర్వహించే ద్విచక్ర వాహనదారులు తరచూ ఒళ్లు నొప్పులతో అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయి. నిధులున్న ప్రాంతాల్లో కూడా అధికారులు పనులు చేయకపోవడం శోచనీయం. మరి కొన్నిచోట్ల నిధులు లేక పనులు జరగడం లేదు. ప్రస్తుత వానాకాలం ప్రారంభం అయింది. ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురవ్వనున్నాయి. సత్వరం అధికారులు స్పందించి బాగుచేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

**గుంతలు పడి.. నీరు నిలిచి..**

తాండూరు మండలం ఈద్గా నుంచి చెంగేష్‌పూరు మీదుగా ఎల్మకన్నె వెళ్లే రోడ్డులోకంకర, తారు తొలగి గుంతలు పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీటిల్లో వరద చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గౌతాపూరు నుంచి చెంగోల్ వరకు కూడా ఇదే పరిస్థితి. తాండూరు పట్టణం నుంచి నారాయణపూర్ వెళ్లే రోడ్డు రైల్వే గేటు వరకు మట్టితో కూడుకున్నది కావడంతో అవస్థలు తప్పడం లేదు. కరణ్‌కోట నుంచి గౌతాపూరు వరకు వచ్చే రోడ్డు చిత్తడిగా మారింది. గౌతాపూరు నుంచి తాండూరు వరకు జాతీయ రహదారిపై చాలా చోట్ల రెండుఅడుగుల లోతు గుంతలు పడ్డాయి.

మరమ్మతు లేక తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లే మార్గంలోని తాండూరు రైల్వే వంతెనపై గుంతలు పడినా మరమ్మతు చేయడంలేదు. 2014లో రూ.7కోట్లతో దీనిని నిర్మించారు. మూడేళ్ల వరకు బాగానే ఉన్నా, అనంతరం తారు తొలగిపోయింది. ఈ గుంతలపై నుంచి వెళ్లిన వాహనాలు తరచూ మరమ్మతుకు గురై ఆగిపోతున్నాయి.

**ప్రమాదకరంగా..:** తాండూరు నుంచి వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డును 2017లో రూ.52 కోట్లతో విస్తరించే పనులు ప్రారంభించారు. చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. తాండూరు పట్టణం విలియమ్ మూన్ కూడలి నుంచి పెద్దేముల్ మండలం దుగ్గాపూరు వరకు అస్తవ్యస్తంగా మారింది.

**ఇదీ లెక్క:** రహదారులు, భవనాల శాఖ పరిధిలో 911.869 కిలోమీటర్లు. ఇందులో 361.875 కిలోమీటర్ల విస్తరణ, వంతెనల నిర్మాణం, రహదారుల మరమ్మతు వంటి 57 పనులను రూ.637.93 కోట్లతో చేపడుతున్నారు. కొన్ని పూర్తయినా, ఇంకొన్ని పూర్తి కాలేదు. మరికొన్ని ప్రారంభానికి నోచలేదు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో అన్ని రకాల రోడ్లు 2,781.29 కిలోమీటర్లు. రూ.262.94 కోట్లతో 917 పనులు చేపడుతున్నారు. ఇందులో 681 పూర్తయ్యాయి. మిగిలినవి కొన్ని ప్రారంభమయ్యాయి.

**వంతెనపై చువ్వలు తేలినా..**

పెద్దేముల్ మండలం బుద్ధారం వాగుపై రూ.3కోట్లతో నిర్మించిన వంతెనపై ఇనుప చువ్వలు తేలాయి. వర్షాకాలంలో నీరు చేరితే వాహనదారులు వేగంలో వెళ్లే సమయంలో అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. గాజీపూరు వద్ద రూ.6 కోట్లతో నిర్మించిన వంతెనకు అనుసంధానంగా చేపట్టే తారు రోడ్డు పనులు పూర్తి కాలేదు. పెద్దేముల్ నుంచి గిరిజన తండా, రుద్రారం మీదుగా నాగులపల్లి వరకు వెళ్లే తారు రోడ్డు అడుగుకోగుంతతో వాహనాలు మరమ్మతుకు గురవతున్నాయి. బుద్ధారం నుంచి పెద్దేముల్ తండా వరకు రూ.కోటికి పైగా నిధులతో తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. కొన్ని చోట్ల కంకర పరిచి వదిలేశారు.

**కంకర తొలగి**

బెన్నూరు నుంచి మండలకేంద్రం యాలాల వరకు ఉన్న తారు రోడ్డు అక్కడక్కడ గుంతలు పడ్డాయి. లక్ష్మీనారాయణపూరు నుంచి ఎన్కేపల్లి, కమాల్‌పూరు నుంచి బాగాయిపల్లి వరకు వెళ్లే దారిపై కంకర, తారు తొలగింది. బండమీది పల్లి నుంచి జుంటుపల్లి, చెన్నారం నుంచి నాగారం వరకు ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రూ.2.68 కోట్లతో నిర్మించాల్సిన రోడ్డును కేవలం కంకర పరిచి వదిలేశారు.

**నిధుల లభ్యత ప్రకారం పూర్తి చేస్తాం: రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఈఈలు**

జిల్లాలో మరమ్మతుకు వచ్చిన రహదారులకు నిధుల మంజూరు లభ్యతను బట్టి పూర్తి చేస్తామని వికారాబాద్ రహదారులు, భవనాల శాఖ ఈఈ లాల్‌సింగ్, తాండూరు, వికారాబాద్ పంచాయతీ రాజ్ శాఖ ఈఈలు శ్రీరాములు, వికారాబాద్ ఈఈ ఉమేష్ కుమార్ తెలిపారు. వర్షాకాలంలో అత్యవసరంగా చేపట్టే పనులపై దృష్టి పెట్టామని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామనిపేర్కొన్నారు.

# మరో 100 రోడ్లకు వాణిజ్య హెూదా



హైదరాబాద్: ఆదాయం పెంపు దిశగా జీహెచ్ఎంసీ మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మరో వంద రోడ్లకు వాణిజ్య హెూదా ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది. గత సర్కారు 2021లో జీ.వో.నెం.102 ద్వారా 118 రోడ్లకు వాణిజ్య హెూదా ఇచ్చింది. మారిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు.. మరో వంద రోడ్లకు ఆ హెూదా ఇవ్వొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 100 అడుగులు, అంతకన్నా ఎక్కువ వెడల్పున్న రోడ్లను ఎంపిక చేసి ప్రాథమిక జాబితాను సర్కారుకు అందించారు. ప్రభుత్వ నిర్ణయం వచ్చాక రోడ్ల ఎంపికపై మరింత కసరత్తు చేసి తుది జాబితాను సిద్ధం చేసే అవకాశం ఉంది. తుదిరూపం ఏర్పడితే రూ.100 కోట్ల ఆదాయం సమకూరనుంది.

హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) 2007లో ఏర్పాటైంది. 17ఏళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో నగరాభివృద్ధి ప్రణాళికకు తగ్గట్టు రూపుదిద్దుకోలేదు. హెచ్ఎండీఏ పరిధిలోనూ అంతే. వాస్తవ పరిస్థితులకు, మాస్టర్‌ప్లాన్‌కు చాలా వ్యత్యాసం ఉంది. బృహత్ ప్రణాళికలో మాదిరి రోడ్ల విస్తరణ, నిర్మాణం జరగట్లేదు. దానితో షాపింగ్ మాల్స్, భారీ వాణిజ్య భవనాలు ఉన్న రోడ్లు అనేకం ఇప్పటికీ నివాస కేటగిరీలో ఉన్నాయి. ఇళ్ల కోసమంటూ అనుమతి తీసుకునే పలువురు యజమానులు, నివాసయోగ్యతాపత్రం(ఓసీ) తీసుకున్నాక ఆయా భవనాలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారు. ఈ రకంగా పార్కింగ్ వసతి లేని భవనాలు రూపం మార్చుకోవడంతో.. పార్కింగ్ వసతి లేక వాహనాలు రోడ్లపై నిలుస్తున్నాయి. ఇతరత్రా సమస్యలూ తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం మరో వంద రోడ్లకు వాణిజ్య హెూదా ఇచ్చి, వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది.

**ఆదాయం పెరుగుతుందిలా..:** ఏదైనా రహదారిని వాణిజ్య రహదారిగా గుర్తిస్తే జీహెచ్ఎంసీకి వేర్వేరు రూపాల్లో ఆదాయం పెరుగుతంది. సహజంగానే ఆస్తిపన్ను ఆదాయం రెట్టింపు నుంచి మూడు రెట్లు పెరుగుతుంది. వాణిజ్య సముదాయాలను నిర్మించాలనుకునే యజమానులకూ మేలే. వాణిజ్యేతర రహదారులపై కమర్షియల్ కాంప్లెక్సులను నిర్మించాలంటే ప్రభుత్వాన్ని సంప్రదించి భూ వినియోగాన్ని మార్చుకోవాలి. ఆ ప్రక్రియ చాలా వ్యయప్రయాసలతో కూడుకుని ఉంటుంది. వాణిజ్య రహదారిపై అయితే.. నేరుగా వాణిజ్య కేటగిరీలో నిర్మాణ అనుమతి లభిస్తుంది. నివాస సముదాయాలనూ నిర్మించుకోవచ్చు. నిర్మాణదారు భవనం విస్తీర్ణంలోని ప్రతి చదరపు అడుగుకు రూ.300ల నుంచి రూ.400ల ఇంపాక్ట్ ఫీజును జీహెచ్ఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ప్రతిపాదన సాకారమైతే.. ఆస్తిపన్ను, నిర్మాణ అనుమతి రుసుము, ఇంపాక్ట్ ఫీజుల రూపంలో జీహెచ్ఎంసీకి ఏటా రూ.100కోట్ల ఆదాయం అదనంగా సమకూరుతుందని అంచనా.

# హాజరుకు నకిలీ మకిలి

హైదరాబాద్ : పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తూ.. వారి జీతాన్ని జేబులో వేసుకుంటోన్న కేటుగాళ్లకు జీహెచ్ఎంసీ అడ్డాగా మారింది. సూపర్‌వైజర్లు, ఏఎంఓహెచ్(సహాయ వైద్యాధికారి)లు ప్రతి నెలా రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్ల గొడుతున్నారు. ఇటీవల కొత్తగా ఐటీ విభాగం బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారిణి దోపిడీని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. ఫలితం దక్కలేదు. వేలి ముద్రల హాజరు విధానాన్ని రద్దు చేసి, ముఖాన్ని స్కానింగ్ చేసే ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకొస్తే.. అందులోని లోపాలను వసూల్ రాజాలు కనిపెట్టేశారు. విధుల్లో లేని కార్మికులను ఉన్నట్టుగా చూపించి వారందరి జీతాలను జేబులో వేసుకుంటున్నారు. జీహెచ్ఎంసీలో 18 వేల మంది కార్మికులుంటే..అందులో ప్రతిరోజూ సుమారుగా 16 వేల మంది విధుల్లో ఉంటారు..వీరిలో దాదాపు నకిలీ హాజరుతో 1000 మంది వేతనాలను సూపర్‌వైజర్లు నొక్కేస్తున్నారు. ఇది దాదాపుగా రూ.2 కోట్లు ఉంటుందని అంచనా.

**రూ.2లక్షలు డిమాండ్..:** సికింద్రాబాద్ జోన్ ముషీరాబాద్ సర్కిల్‌లోని ఓ డివిజన్‌లో సూపర్‌వైజర్ పరిధిలో 21 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. అందులోని ఐదుగురు కార్మికులు పని చేయకపోయినా హాజరు వేసి వేతనాలను తీసుకుంటున్నారు. వారికి రూ.2,500లు ఇస్తారు. తమను విధుల్లోకి చేర్చుకోవాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు.

**'నిఘా'ఇలా..:** కొందరు బాధితులు ఆశ్రయించి.. తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. మరుసటి రోజే సూపర్‌వైజరు నుంచి వాళ్లకు ఫోన్ వచ్చింది. జూన్ 3న ఉదయం 10గంటలకు బ్యాంకుకు వెళ్లి జీతం తీసుకోవాలని చెప్పాడు. బాధితులతో కలిసి బ్యాంకు వద్ద నిఘా ఉంచింది. కాసేపటికి సూపర్‌వైజరు వద్ద పనిచేసే మరో కార్మికురాలు కొన్ని బ్యాంకు పాసుపుస్తకాలను తీసుకొని వచ్చింది. అక్కడికి చేరుకున్న ఇద్దరు బాధితులను లోపలికి తీసుకెళ్లి జీతం డబ్బును డ్రా చేయించి, ఆ మొత్తాన్ని ఆమె తీసుకుంది. ఆ ఇద్దరు బాధితులకు రూ.2,500లు ఇచ్చి వెళ్లిపోయింది. అనంతరం.. బృందం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను, ఐటీ విభాగాన్ని సంప్రదించింది. సూపర్‌వైజరు పరిధిలో పనిచేస్తోన్న కార్మికుల రోజువారీ హాజరును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే.. వారికి రోజూ హాజరు పడుతోంది. కానీ.. కొన్ని రోజులుగా వారు విధులకు వెళ్లట్లేదని చెప్పే ఆధారాలను ఇస్తే ఆశ్చర్యపోయారు.



**విధానంలో లోపాలు..** నకిలీ వేలి ముద్రలతో హాజరు వేస్తున్నారని.. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను జీహెచ్ఎంసీ ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చింది. దాంతో దాదాపు 1,500ల మంది నకిలీ కార్మికుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వారం తిరిగే సరికి.. మళ్లీ కార్మికుల సంఖ్య పెరగడం మొదలైంది. యాప్‌లో ఉన్న లోపాలే అందుకు కారణమని తెలుస్తోంది. ఎస్ఎఫ్ఏలు స్కాన్ చేస్తోన్న కార్మికుల ముఖాలు సాఫ్ట్‌వేర్‌లో నిల్వ ఉండట్లేదు. ఎస్ఎఫ్ఏ చేస్తోన్న నకిలీ హాజరును గుర్తించే సదుపాయం ఏఎంఓహెచ్‌కే ఉంది. పై అధికారులు సిబ్బంది ఫొటోలను చూసేందుకు యాప్ అనుమతించట్లేదు. కార్మికుల ఫొటో లేదా వీడియోలను ఉపయోగించి సూపర్‌వైజర్లు, ఏఎంఓహెచ్‌లు నకిలీ హాజరుకు పాల్పడుతున్నారు.

# ఎవరికీ పట్టని వలస బతుకులు

పెద్దపల్లి: వలస కార్మికుల రక్షణకు పాలకులు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా.. క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వెరసి రోజు రోజుకు జిల్లాలో వలస కూలీలకుపై దాడులు పెరుగుతున్నాయి. రోడ్డెక్కితే తప్పా వారి ఫిర్యాదులను కూడా పట్టించుకునే పరిస్థితి జిల్లాలో లేకుండా పోయింది. తాజాగా సుల్తానాబాద్‌లో ఘటన వలస కూలీల భద్రతపై సందేహాలను లేవనెత్తింది.

**దస్త్రాల్లో కనిపించని కార్మిక గణాంకాలు**

పనులు చేసేందుకు కూలీలు కావాలనేది పరిశ్రమల నిర్వాహకుల లక్ష్యంగా ఉండటంతో వారు ఇతర రాష్ట్రాల నుంచి దళారుల సహాయంతో కూలీలను సమకూర్చుకుంటున్నారు. వారి వివరాలేవి అధికారులకు ఇవ్వడమనే విధానమే లేదు. పరిశ్రమల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం మినహా అందులో జరిగే ఉత్పత్తులు, పనిచేసే కార్మికులు, వారికి మౌలిక వసతుల కల్పించడం లాంటివేవి తమ పరిధిలోకి రావని పరిశ్రమల శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ఒక పరిశ్రమలో పనిచేసే స్థానికులు, స్థానికేతరులు ఎంతమంది? కనీస వేతనం లభిస్తుందా? కార్మికులను ఏవిధంగా నియమించుకుంటున్నారు.. వారిలో నైపుణ్య కార్మికులు ఎంతమంది.? నైపుణ్యం లేనివారెంత మంది.? అనే గణాంకాలేవి అధికారుల వద్ద లేవు.

**పని కేంద్రాల్లో సౌకర్యాలేవీ?**

జిల్లాలో వలస కూలీల సంఖ్య వేలల్లో ఉంది. సీజన్‌ను బట్టి కూలీల సంఖ్య మారుతూ ఉంటుంది. ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, పత్తిమిల్లులతో పాటు భవన నిర్మాణం, ఇతర పరిశ్రమలల్లో ఒడిశా, బిహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు 10 వేల నుంచి 20 వేల వరకు జిల్లాలో



జీవనం సాగిస్తున్నారు. వీరందరూ కుటుంబాలతో వచ్చి, నెలల తరబడి ఇక్కడే పనిచేసుకుంటారు. నైపుణ్య కార్మికులు సొంతంగా అద్దె నివాసాల్లో ఉంటూ జీవనం సాగిస్తుండగా, అన్‌స్కిల్డ్ కార్మికులు మాత్రం దళారుల సహాయంతో ఇక్కడి వచ్చి, వెట్టిచాకిరి పనుల్లో మగ్గుతున్నారు. పరిశ్రమల నిర్వాహకులు వీరికి పనిప్రాంతంలోనే నివాసాలు ఏర్పాటు చేస్తుంటారు. అరకొర గదుల్లో ఉండలేక, ఆరుబయటే కూలీలు నిద్రిస్తుండటంతో తరచూ ప్రమాదాలకు గురవుతుంటారు. సుల్తానాబాద్‌లోని బియ్యం మిల్లులో జరిగిన ఘటనలోనూ బాలికతో పాటు బాలిక తల్లి కూడ ఆరుబయటే నిద్రించడంతో కామాందుడి దృష్టి పడింది. గతంలో ఇటుక బట్టీల ప్రాంతంలోనూ ఆరుబయట నిద్రిస్తున్న కూలీలపై వాహనాలు వెళ్లి ప్రమాదాలబారిన పడిన ఘటనలున్నాయి. పాములు, విషపు పురుగుల బారిన పడి అనేక మంది వలస కూలీలు మృత్యువాత పడుతున్నారు.

**మిల్లుల్లో ఆవాసాలతో మాకు సంబంధం లేదు**

బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు, వారికి పరిశ్రమలు ఏర్పాటు చేసే ఆవాసాలు, ఇతర మౌలిక వసతులతో మాకు సంబంధం లేదు. వాటిని పరిశ్రమల శాఖ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆయా రంగాల్లో పనిచేసే కార్మికుల కోసం అనుమతి తీసుకోవాలి. ఇటుక బట్టీలలో పనిచేసే వలస కార్మికుల సమస్యలు, వారికి మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించడం, రక్షణ చర్యలు తీసుకోవడంలో మా శాఖ దృష్టి పెడుతుంది.– రాంమోహన్, సహాయ కార్మికాధికారి నాలుగింటికే అనుమతి ఉందిజిల్లాలో కేవలం నాలుగు బియ్యం మిల్లులు మాత్రమే పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకున్నాయి. పరిశ్రమలకు అనుమతిం చడంలో పర్యావరణ ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకొంటాం. కానీ అందులో పనిచేసే కార్మికులు, వారికి వసతుల కల్పన మా పరిధిలోకి రావు. ఘటన జరిగిన బియ్యం మిల్లు పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకోలేదు.– మధుసూధనచారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్

# ఇసుకను తోడి.. హద్దులు మీరి

కామారెడ్డి: బిచ్కుంద మండలం ఖద్గాం–శెట్లూర్ శివారులో ఆరు క్వారీలలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఆయా రీచ్‌లలో తవ్వకాలు చేసే గుత్తేదారుల కాలపరిమితి ముగిసింది. నిర్దేశించిన మేర ఇసుక తవ్వకాలు పూర్తికాలేదనే నెపంతో మూడు నెలల కిందట ఇసుకాసురులు మళ్లీ అనుమతులు సాధించారు. ఖద్గాంలోని క్వారీ, గుండెనెమ్లిలోని మరో క్వారీలో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. గుత్తేదారులు తవ్విన ఇసుకను రీచ్‌లలో డంప్ చేయాల్సి ఉంటుంది. దీనిని టీఎస్ఎండీసీ



ఆధ్వర్యంలో విక్రయించాలి. కానీ టీఎస్ఎండీసీ అధికారులతో కుమ్మక్కయిన గుత్తేదారులు రాజధానితో పాటు మహారాష్ట్ర, కర్ణాటకకు ఇసుకను తరలిస్తూ దోపిడీ చేస్తున్న తీరుపై కథనం.


**సమస్తం ఉల్లంఘనలే** రవాణా శాఖ నుంచి వేబిల్లులు తీసుకొని.. ఒకే బిల్లుపై పది నుంచి 20 టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. క్వారీలు, రీచ్‌లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి తవ్వకాలు చేయాలి. కానీ విరుద్ధంగా సాగుతోంది. ఎవరైనా క్వారీలు, రీచ్‌లలోకి వస్తే ప్రైవేటు సెక్యూరిటీతో దాడులు చేయిస్తూ భయపెడుతున్నారు. రాష్ట్రంలోనే ఇసుక విక్రయించాల్సి ఉండగా.. మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తున్నారు. ఇటీవల ఖద్గాం క్వారీ నుంచి అనుమతులు లేకుండా జహీరాబాద్ మీదుగా కర్ణాటకు ఇసుకను తరలిస్తున్న ఐదు లారీలను సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. రాత్రి వేళల్లో వేబిల్లులు లేకుండా ఖద్గాం, గుండెనెమ్లి రీచ్‌ల నుంచి వందలాది టిప్పర్లలో ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రెండు రోజుల కిందట మహారాష్ట్రకు వెళ్తున్న ఐదు ఇసుక లారీలను బిచ్కుంద పోలీసులు పట్టుకుని సీజ్ చేయడమే ఇందుకు సాక్ష్యం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
గురువారం 20 జూన్ 2024

# తక్కువ సమయం.. ఎక్కువ మందికి ప్రయోజనం

హైదరాబాద్: క్యాన్సర్ చికిత్సలో కీలకమైన రేడియేషన్ థెరపీలో అత్యాధునిక సేవలు ఎంఎన్‌జేలో అందుబాటులోకి రానున్నాయి. దాదాపు రూ.30 కోట్లతో ఈ ఆధునిక రేడియేషన్ థెరపీ యంత్రాన్ని ఆసుపత్రిలో సమకూర్చారు. అటమిక్ ఎనర్జీ విభాగం నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఈ సేవలు అందించనున్నారు. ఇలాంటి ఆధునిక యంత్రాలు ప్రస్తుతం పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉన్నాయి. రేడియో థెరపీలో ఇదో విప్లవాత్మక మార్పు అని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ యంత్రంపై పిల్లలతోపాటు పెద్దలకు రేడియో థెరపీ అందించే వీలు ఉంటుంది.

ఇవీ ఉపయోగాలు..ప్రస్తుతం ఆసుపత్రిలో నిత్యం చెరో 300 చొప్పున కీమో, రేడియేషన్ థెరపీలు అందిస్తున్నారు. కొన్నిసార్లు ఒక్కొక్కరికి అందించడం ద్వారా ఎక్కువ సమయం పడుతోంది. ఈ ఆధునిక యంత్రంతో తక్కువ సమయంలో ఎక్కువ మందికి చికిత్స అందించవచ్చు.క్యాన్సర్ కణితిని కూడా కచ్చితత్వంతో ధ్వంసం చేస్తుంది.



రేడియేషన్ థెరపీలో క్యాన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలు దెబ్బతింటుంటాయి.ఆరోగ్యకరమైన కణాలు దెబ్బతింటే పునరుత్పత్తి కష్టమవుతుంది. ఈ ఆధునిక యంత్రంలో అలాంటి ఇబ్బంది తక్కువ. పూర్తిగా కణితి ఉన్న చోటే రేడియో థెరపీ అందించనున్నారు. అతిచిన్నగా ఉన్న కణుతులను ఈ థెరపీతో పూర్తి స్థాయిలో చికిత్స అందించే వీలుంది.ప్రైవేటులో లక్షలు ఖర్చయ్యే వివిధ రకాల క్యాన్సర్లకు ఎంఎన్‌జేలో ఉచితంగా అందించనున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నారని, ఆయా ప్రభుత్వాలు అందించే బీమా సేవలు ఎంఎన్‌జేలో అమలయ్యేలా పరస్పర అవగాహన కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

# పూడిక తొలగింపుతోనే.. భవిష్యత్తుకు భరోసా

జగిత్యాల : శ్రీరాంసాగర్ జలాశయంలో పూడిక పేరుకుని నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు తగ్గినట్లు ఇటీవలే అధికారులు గుర్తించారు. కాగా 112 టీఎంసీల సామర్థ్యం గల ఎస్సారెస్పీలో ఇదివరకే నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలకు తగ్గగా ప్రస్తుతం మరో 10 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం తగ్గటం ఆందోళనకర అంశంగా మారింది. ఈ ప్రభావం జగిత్యాల జిల్లాపై అమితంగా పడనుండగా వాననీటి సంరక్షణతోనే జిల్లాలో సాగుకు సుస్థిరత ఏర్పడనుంది.

గతేడాది వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 209 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపుగా 100 టీఎంసీల వరకు నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సి వచ్చింది. జిల్లాలోనూ సాధారణం కన్నా 32 శాతం అధిక వర్షపాతం నమోదైనా దాదాపుగా 28 టీఎంసీలకుపైగా వరదనీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. అధిక వర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాదిపొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, వినియోగం అత్యంత అవశ్యంగా మారింది. ముఖ్యంగా వ్యవసాయ ధారిత జిల్లాలో వర్షపునీటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. జిల్లాలోని 4.33 లక్షల ఎకరాల సాగులో 2.42 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.

ఒక ఏడాదిలో సరాసరిగా 85-103 గంటల వాన మాత్రమే కురుస్తుండగా.. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని ఏడాది పొడవునా



వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10-17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40-51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలంబయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. దీనికిగాను ప్రతి పొలంలోనూ లోతట్టులో నీటినిల్వ కుంటకాలను తవ్వాలి. పంటపొలాల్లో, వాలుకు అడ్డంగాదున్ని కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి, తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు.వ్యవసాయ బావులను రీఛార్జ్‌చేసేలా బావికి సమీపంలో గుంతతవ్వి వృథానీటిని ఇందులోకి మళ్లించాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలను సమర్థంగా నిర్మించాలి. అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ ద్వారా కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలు ఇస్తోంది. జిల్లాలో 1,226 చెరువులుండగా మరమ్మతు పూర్తిచేసి అన్నింటిలోనూ పూర్తిస్థాయిలో వర్షపునీటిని నిల్వచేయాలి. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20-43 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69-93 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి వినియోగ సామర్థ్యాన్ని పెంచాల్సిఉంది. అన్ని చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి, ఎస్సారెస్పీలోనూ పూడికతీసి నీటినిల్వను 112 టీఎంసీలకు పెంచాలి.

నిల్వ నీటితో ప్రయోజనం– పి.రవి, శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, జగిత్యాల

తక్కువ వర్షపాత సంవత్సరాల్లో వర్షపునీటి నిల్వ ఎంతగానో ఉపకరిస్తుంది. వాగులపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలతో దాదాపు 3-6 టీఎంసీల అదనపు నీటినిల్వ, వినియోగం సాధ్యపడుతుంది. వర్షపునీటి ఆనకట్టలు, అడవుల్లో పర్క్యులేషన్ ట్యాంకులు, అన్ని చెరువులు, కుంటల్లో పూడిక తీతతో నీరు నిలిచి అనేక ప్రయోజనాలుంటాయి.

# కానరాని.. ఖనిజ సంక్షేమ నిధి



తాండూరు : జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వీటి తవ్వకాలతో సర్కారుకు ఏటా రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతోంది. ఇందులోంచి కొంత మొత్తాన్ని గనుల ప్రభావిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కేటాయిస్తోంది. వీటితో ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ మొత్తాన్ని మంజూరు చేయలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధికి నిధుల్లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కథనం. జిల్లాలోని ఇరవై మండలాల్లో ఎర్రమట్టి, సుద్ద, నాపరాయి, కంకర, పలుగురాయి, గ్రానైట్ నిక్షేపాలున్నాయి. దాదాపు 6వేల ఎకరాల్లో ఖనిజ నిక్షేపాల నేలలు ఉన్నాయి. వీటిని తవ్వకాల ద్వారా వెలికితీసి ఎగుమతులు చేసేందుకు ఏడు శాఖల ద్వారా సంబంధిత అనుమతులు జారీ చేస్తున్నారు. తవ్వకాలు, ఎగుమతులతో వ్యాపారులు గనులు భూగర్భ వనరుల శాఖకు రుసుం, సుంకం, తదితరాలను చెల్లిస్తున్నారు. వీటి ద్వారా సర్కారుకు ఏటా రూ.వంద కోట్ల ఆదాయం సమకూరుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.113.46 కోట్లు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. వాస్తవానికి అంతకుమించి రూ.115.04కోట్లు ఆదాయం వచ్చింది. ఇందులోంచి రూ.22 కోట్ల నుంచి రూ.30కోట్ల వరకు గనుల ప్రభావిత గ్రామాల్లో సంక్షేమానికి ఖర్చు చేసేందుకు కేటాయించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు.గ్రామాలకు కేటాయింపుల ఊసేది: లక్ష్యానికి మించి ఆదాయం సమకూరడంతో గనుల శాఖ ద్వారా కొంత మొత్తాన్ని డీఎమ్ఎఫ్‌టీ కమిటీకి చెల్లిస్తారు. జిల్లా మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరించే కమిటీ ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో ఖనిజ సంక్షేమ నిధిని జిల్లాలోని 566 పంచాయతీలకు మంజూరు చేస్తారు. వాటిని విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్లు, ఉపాధి కల్పన, స్త్రీ శిశు సంక్షేమం, క్రీడలు, విగణిత విద్యకు సద్వినియోగం చేసే వీలుంటుంది. ఈ ఏడాది ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పల్లెల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు చేపట్టే వీల్లేకుండాపోయింది. గతేడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్, ఆ తర్వాత పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అనంతరం ఎంపీ ఎన్నికల కోడ్‌ను ఈనెల 4న వరకు అమలు చేయడంతో నిధుల మంజూరుకు అవకాశం లేకపోయింది. 70 శాతం పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఆటంకంగా మారింది. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, ట్యాంకుల శుభ్రత వంటి స్వచ్ఛత కార్యక్రమాలకు నిధుల కొరత నెలకొంది. ఖనిజ సంక్షేమ నిధులు విడుదల చేస్తే కొంతవరకు పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ఊరట కలగనుంది. కోడ్ ముగిసినా ఖనిజ సంక్షేమ నిధుల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.త్వరలో కేటాయిస్తాం: శ్రీనివాస్, డీఆర్డీవో

నిధులు కలెక్టర్ పరిధిలో ఉన్నాయి. త్వరలో డీఎమ్ఎఫ్‌టీ కమిటీ సమావేశం నిర్వహించి నిధులు కేటాయించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గ్రామాలకు నిధులు అందించేందుకు కృషి చేస్తాం.

# అటవీ భూమిని వీడని కబ్జా పర్వం!



బషీరాబాద్: రెండు దశాబ్దాలుగా తెలంగాణ అటవీ భూములను ఆక్రమించుకుని కర్ణాటక వాసులు సాగు చేస్తూ పంటలు పండిస్తున్నారు. అటవీ అధికారులు తరుచూ వెళ్లి హెచ్చరించి పంపించడం.. మళ్లీ అదే పరిస్థితి. ఈ భూమి తమదేనంటూ మన అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భూమికి హద్దులు ఏర్పాటు చేసే అంశం చిక్కుముడిలా మారింది. వివాదం తేలకపోవడంతో తెలంగాణ అటవీ భూములను కర్ణాటక రైతులు కబ్జా చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమై చర్చించి, హద్దులను నిర్ధరిస్తేనే ప్రయోజనముంటుంది.

1300 హెక్టార్ల వరకు: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం పరిధిలో అటవీప్రాంతంలో సుమారు 1,300 హెక్టార్ల వరకు వికారాబాద్‌కు చెందిన అటవీ భూమే. అయితే కర్ణాటక రైతులు చెట్లను నరికేయడం, కబ్జా చేసి సాగు చేసుకోవడంతో అరణ్యం కాస్త సాగుకు అనువుగా మారిపోతున్నాయి. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా, వినిపించుకోవడం లేదు. కర్ణాటక పరిధి సర్వే సంఖ్య 1, 2 లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని చెబుతున్నారు. దీంతో ఏమీ చేయలేకపోతున్నారు. దీనినే ఆసరా చేసుకుని సుమారు 200 ఎకరాలు కబ్జాకు గురైందని అధికారులే చెబుతున్నారు.

నిత్యం గొడవలు: కర్ణాటక వాసులు వచ్చి మన భూమిలో సాగుకు ఉపక్రమించడం, మన అధికారులు వెళ్లి అడ్డుకోవడంతో వారిపై పలుమార్లు గొడవకు దిగడం, ప్రత్యక్ష దాడులకు దిగిన సంఘటనలు ఉన్నాయి. ఉద్యోగ బాధ్యతలో న్యాయం చేయాలనే కోణంగా అటవీశాఖ అధికారులు రేయింబవళ్లు నిఘా పెట్టినా, ఉన్నతాధికారుల సహకారం లేకపోవడంతో నిస్సహాయ స్థితికి చేరుకుంటున్నారు. విత్తనాలు విత్తే సమయంలో అడ్డుకోవడం, మళ్లీ కొన్ని రోజులయ్యాక అధికారులు లేని సమయం చూసి కబ్జా కొనసాగించడం నిత్యకృత్యమైంది. పదేళ్లుగా ఇలాగే కొనసాగుతుండడంతో అధికారులు ఏం చేయలేకపోతున్నామని తలలు పట్టుకుంటున్నారు.

కొడంగల్ వద్ద: కొడంగల్ సరిహద్దు ప్రాంతంలోనే ఈ అటవీ భూమి కబ్జాల వ్యవహారం కొనసాగుతోంది. ఎడమవైపు కొడంగల్, కుడివైపు బషీరాబాద్, కర్ణాటక సరిహద్దు ఉంది. ఈ ప్రాంతాలకు ఆనుకునే అటవీ భూమి ఉంది. తాండూరు రేంజ్ అధికారులు ఇరు రాష్ట్రాల సంయుక్త సర్వేకు నివేదించామని, జిల్లా స్థాయి అధికారుల పరిధిలో ఉందని చెప్పడంతో సమయం ముగుస్తోందని కిందిస్థాయి అధికారులు ఆవేదన చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందించి ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సంయుక్త సర్వేకు నివేదించాం

బషీరాబాద్ మండలంలోని అటవీభూములు కర్ణాటక ప్రజలు కబ్జా చేశారని గుర్తించాం. నిరంతరం అడ్డుకుంటున్నాం.కబ్జా విడిపించి కొంత స్థలంలో మొక్కలు నాటాం. ఇరు రాష్ట్రాల అధికారుల సంయుక్త సర్వే చేయాల్సి ఉంది. జిల్లా రెవెన్యూ, అటవీశాఖల అధికారుల దృష్టికి తీసుకెళుతూనే ఉన్నాం. అటవీభూముల పరిరక్షణ అధికారి, జిల్లా పాలనాధికారికి మరోసారి విన్నవించి త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

శ్యాంసుందర్, అటవీశాఖ అధికారి, తాండూరు.

తెలంగాణ భూమిలో కన్నడీగుల సాగు

8మందిపై కేసు నమోదుతెలంగాణ సరిహద్దు మండలమైన బషీరాబాద్ అటవీ భూమిలో కర్ణాటక రైతులు చొచ్చుకొచ్చి భూములు సాగు చేస్తున్నారు. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతాన్ని సందర్శించి కబ్జా విడిపించారు. సాగు చేసిన 8 మంది కర్ణాటక వాసులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. కర్ణాటక రాష్ట్రం పలుగుకుచ్చ తండా, గోప్యానాయక్ తండాకు చెందిన వారిపై కేసు నమోదైంది.. తాండూరు రేంజ్ అధికారి శ్యాంసుందర్, పీర్యానాయక్, సిబ్బందితో కలిసి కబ్జా చేసిన అటవీ భూమి వద్దే ఉండి, తాండూరు, బషీరాబాద్, వికారాబాద్ సర్వేయర్లు, కర్ణాటక సేడం, ముదోల్‌కు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు, సర్వేయర్లను అటవీ ప్రాంతానికి పిలిపించుకుని కబ్జా విషయమై తేల్చుదామని ప్రయత్నించారు. ఉన్నతాధికారులకు వివరించాకే సర్వే చేస్తామని కర్ణాటక అధికారులు వెళ్లిపోయారు. అప్పటి వరకు భూమిలోకి ఎవరూ రావొద్దని ఒప్పందం చేసుకున్నారు.

# గోదావరి నుంచి అత్యవసర పంపింగ్

హైదరాబాద్: నగర అవసరాలకు గోదావరి జలాల తరలింపునకు సంబంధించి అత్యవసర పంపింగ్‌కు జలమండలి సిద్ధమవుతోంది. 7 పంపులతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి ప్రాజెక్టు అప్రోచ్ ఛానెల్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. గురు, శుక్రవారాల్లో ట్రయల్‌రన్ ప్రారంభించిన అధికారులు...ఈ నెల 18 నుంచి పూర్తి స్థాయిలో అత్యవసర పంపింగ్ చేపట్టనున్నారు. నిత్యం 172 మిలియన్ గ్యాలన్లు అటు మిషన్ భగీరథతోపాటు ఇటు నగర అవసరాలకు అందిస్తున్నారు. కృష్ణా తర్వాత ఎక్కువ శాతం గోదావరి జలాలపైనే నగర ప్రజలు ఆధారపడ్డారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 5 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయి. నగరానికి నీటిని తరలించే పంప్‌హౌస్‌కు నీటి సరఫరా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో జలాశయం లోపల భారీ పంపులతో పంప్‌హౌస్‌కు వెళ్లే అప్రోచ్ ఛానెల్‌లో ఎత్తిపోయాలి.

నాగార్జునసాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం 504.67 అడుగులు...500 అడుగుల వరకు నిత్యం 270 ఎంజీడీలను నగరానికి తీసుకోవచ్చు. రుతుపవనాల రాకతో వానలు కురుస్తున్నాయి. గోదావరిలోకి కొంచెం వరద పెరిగింది. ఎల్లంపల్లిలోకి కూడా వరద రావడంతో ఇక అత్యవసర పంపింగ్ అవసరం ఉండదని తొలుత అధికారులు భావించారు. వరద కంటే ఎక్కువ జలాలు వాడుతుండటంతో ఎల్లంపల్లిలోనూ నీటి మట్టం తగ్గుతోంది. దీంతో అత్యవసర పంపింగ్‌నకు జలమండలి సన్నాహాలు చేస్తోంది.

# ఆలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

వేములవాడ : ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఆలయ ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. దీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న వారికి ఈసారి స్థానచలనం తప్పదని చెబుతున్నారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ఉద్యోగుల్లో కొద్ది రోజులుగా ఈ అంశంపై చర్చ సాగుతోంది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల అధికారులతో ఇటీవల హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించి ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై చర్చించినప్పటి నుంచి ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని మార్చాలని, ఈ మేరకు జాబితా సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించడంతో జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి, బాసర శ్రీసరస్వతీ అమ్మవారు, సికింద్రాబాద్ గణేశ్ ఆలయాలతోపాటు మరో 14 చిన్న చిన్న దేవాలయాల్లోని ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ చేపట్టి స్థానచలనం కల్పించనున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బదిలీలు చేపట్టాలని నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు స్థానచలనం కల్పించి భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో బదిలీల పర్వానికి తెర లేపినట్లు సమాచారం.ఇక్కడే ఉద్యోగం.. ఇక్కడే విరమణ

రాష్ట్రంలోని చాలా దేవాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు బదిలీలు లేకపోవడంతో ఉద్యోగం పొందిన చోటనే విరమణ పొందిన సందర్భాలున్నాయి. చివరి వరకు ఒకేచోట పని చేస్తున్న వారు నిర్వహించిన విభాగాల్లో వివిధ రూపాల్లో అవినీతి మరకను అంటించుకున్నారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 14 మంది అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో విజిలెన్స్ అధికారులు ఆయా ఉద్యోగులకు నోటీసులు జారీ చేసిన సంఘటనలున్నాయి. చాలా మంది అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైన సంఘటనలతో అప్రతిష్ఠను మూటగట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో బదిలీలు చేపట్టి భక్తులకు సేవలు విస్తృతం చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆలయాల్లో భక్తులకు వసతులు మెరుగుపరచడంతోపాటు అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సేవలందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. దీంతో తొందరలోనే ఆలయాల్లో బదిలీలు జరుగుతాయని ఆలయ ఉద్యోగులు భావిస్తున్నారు. కొందరు ముందస్తుగా పైరవీలకు దారులు వెతుకుతున్నారు. ఇటీవల వరకు ఎన్నికల కోడ్ కారణంగా బదిలీలలో కొంత జాప్యం నెలకొంది. కోడ్ ముగియడంతో త్వరలోనే బదిలీల ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో వెలువడనున్నట్లు ఆలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశం. ఎప్పుడు జరుగుతాయనేది చెప్పలేం. బదిలీలు జరిగితే తప్పక వివరాలు వెల్లడిస్తాం.– రామకృష్ణ, ఈవో, రాజన్న ఆలయం

# మురుగు శుద్ధి ఎప్పుడో?

సిరిసిల్ల : జిల్లా కేంద్రం.. సిరిసిల్ల పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. జనావాసాలు, డైయింగ్ యూనిట్ల నుంచి నిత్యం 20 ఎంఎల్‌డీ (మిలియన్ లిక్విడ్ డిఛార్జి)లకు పైగా వ్యర్థ జలాలు నేరుగా మానేరు వాగులో కలుస్తున్నాయి. వీటిని శుద్ధి చేశాకే వాగులోకి పంపాలి. దీనిని సమర్థవంతంగా నిర్వహిస్తే స్వచ్ఛభారత్‌లో సిరిసిల్ల పురపాలికకు వాటర్ ప్లస్ హోదా లభిస్తుంది. 2022లో 30 ఎంఎల్‌డీ ల సామర్థ్యంతో ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇప్పటికీ 95 శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా పట్టణంలోని మురుగు కాల్వ అనుసంధానం, శుద్ధి చేసిన నీటిని వాగులోకి వదిలేందుకు పైపుల ఏర్పాటు వంటి చివరి దశ పనులు మాత్రం మిగిలి ఉన్నాయి. కాగా గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా పట్టణంలోని వరద నీటితోపాటు మురుగంతా వాగులోకి వెళ్లే పరిస్థితులే కనిపిస్తున్నాయి.జిల్లాలోని సిరిసిల్ల, వేము లవాడ రెండు పురపాలికల్లో ఎస్టీపీల నిర్మాణాలకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వేములవాడ పట్టణంలో రహదారులు, మురుగు కాల్వల విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండటంతో తొలుత సిరిసిల్ల పట్టణానికి రూ.61 కోట్లు మంజూరు చేశారు. వీటితో శాంతినగర్ శివారులో 30 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. ఈ నిధుల నుంచే భూసేకరణకు పరిహారం ఇచ్చారు. ఎస్టీపీ



నిర్మాణానికి రూ.32 కోట్లు కేటాయించారు. దీనిలోనే అయిదేళ్ల నిర్వహణ కూడా గుత్తేదారు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనుల్లో ఇప్పటికీ దాదాపు 95 శాతం పూర్తయ్యాయి. గుత్తేదారు సంస్థకు పూర్తి చేసిన పనులకు గాను దాదాపు రూ.25 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. దీంతో చివరి దశ పనులు పూర్తి చేయడంలో మరింత జాప్యం జరుగు తోంది. ఎస్టీపీని ప్రారంభించి మురుగు శుద్ధి చేస్తే వాగులోకి వ్యర్థ జలాలు వెళ్లకుండా అడ్డుకట్ట పడుతుంది.

ఎత్తిపోతలతో అదనపు ఖర్చు పట్టణం నుంచి వస్తున్న వ్యర్థ జలాలు మొత్తం మానేరు కరకట్ట వద్ద నిలుస్తున్నాయి. వర్షాలకు వరద ప్రవాహం పెరిగితే ఎగువన పట్టణంలోని కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీనికోసం కరకట్ట వద్ద నిలిచిన నీటిని 125 అశ్వసామర్థ్యం ఉన్న మూడు మోటార్లతో ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ మోటార్ల నిర్వహణ, విద్యుత్తు బిల్లులకుగాను ఏటా రూ.12 లక్షలపైనే చెల్లిస్తున్నారు. ఇదే ఖర్చుతో పట్టణం నుంచి వెలువడుతున్న మురుగు శుద్ధికి ఫిల్టర్ బెడ్‌లను నిర్మించి ఇసుకతో నీటిని శుద్ధి చేస్తే కాస్తయినా ప్రయోజనం కలిగేది. అధికారుల ప్రణాళికలేమి వల్ల రూ.కోట్లలో ప్రజాధనం నీటిలో పోస్తున్నారు.చివరి దశలో ఉందిఎస్టీపీ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. చివరి దశలో చేపట్టాల్సిన పనులు కొంతమేరకు మిగిలి ఉన్నాయి. త్వరలో వాటిని పూర్తి చేసి ట్రయల్‌రన్ నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నాం. పూర్తయ్యాక నేరుగా మురుగు శుద్ధి ప్రక్రియ ప్రారంభిస్తాం.– లావణ్య, పురపాలక కమిషనర్, సిరిసిల్ల




## తెలంగాణ భాజపా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

తెలంగాణ భాజపా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలు అధ్యక్ష పీఠం కోసం దిల్లీలో మకాం వేసి లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇప్పుడు తాజాగా కమలం పార్టీలో కొత్త చిక్కు వచ్చిపడింది. పాత, కొత్త అనే పంచాయితీ మొదలైంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కొత్తగా పార్టీలో చేరినవారికి టికెట్లు కట్టబెట్టారు కాబట్టి తమకు పార్టీ పదవీ బాధ్యతలైనా ఇవ్వాలనే డిమాండ్ సీనియర్ నేతల నుంచి వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర రథసారథి నియామకంపై అధిష్ఠానం డైలామాలో పడినట్లు తెలుస్తోంది.




చమురును కేవలం డాలర్లలోనే విక్రయించాలని సౌదీ అరేబియా, అమెరికా మధ్య 1974 జూన్ 8న ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది జూన్ 9తో ఆ ఒప్పందానికి గడువు తీరిపోయింది. ఒప్పందాన్ని కొనసాగించకూడదని సౌదీ నిర్ణయించింది. ఇది ప్రపంచార్థికంపై విస్తృత ప్రభావం చూపనుంది. చమురును డాలర్లలోనే విక్రయించాలనే ఒప్పందం కుదరడానికి ముందు– అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడివడి ఉండేది. దీన్ని గోల్డ్ స్టాండర్డ్‌గా వ్యవహరించేవారు. 1974లో సౌదీ తదితర అరబ్ దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగిపోయాయి.


దాంతో అమెరికా రంగంలోకి దిగి సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని ఒప్పించింది. దానికి బదులుగా సౌదీకి సైనిక, ఆర్థిక సహాయం చేస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి నుంచి సౌదీతోపాటు చమురు ఎగుమతి దేశాల సంఘ (ఒపెక్) సభ్యదేశాలన్నీ డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపడంతో 'పెట్రో డాలర్' అనే పదబంధం ప్రాచుర్యంలోకి వచ్చింది.

**అమెరికా ఆధిపత్యం :** అంతర్జాతీయ విపణిలో అనేక వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం దక్కింది. డాలర్‌కు గిరాకీ పెరిగిపోవడంతో ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ అమాంతం పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కావడంతో, దానినే తన ఆయుధంగా మలచుకునే సౌలభ్యం అమెరికాకు ఏర్పడింది. ఉక్రెయిన్ యుద్ధం వల్ల రష్యా మీద అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించడం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురుతిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం కలుగుతుంది. పెట్టుబడులూ ఆగిపోతాయి. డాలర్‌తో పోలిస్తే ఆ దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీ చెల్లింపు మోయలేని భారమవుతుంది. చైనాపై అమెరికా వాణిజ్య యుద్ధం కూడా డాలర్ ఆధిపత్యానికి మరో కోణమే. దీన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా స్థానిక కరెన్సీలలోనే లావాదేవీలు జరపాలని నిశ్చయించాయి. బ్రిక్స్ వేదికగా డాలర్‌పై సమర శంఖం పూరించాయి. పెట్రో డాలర్‌కు సౌదీ అరేబియా స్వస్తి చెప్పడం బ్రిక్స్‌కు కలిసివస్తుంది. చమురు అమ్మకాలకు ఇక నుంచి డాలర్లతోపాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఈయు) యూరో, జపనీస్ యెన్‌లలోనూ చెల్లింపులు స్వీకరిస్తానని సౌదీ ప్రకటించింది. బిట్ కాయిన్లు, డిజిటల్ కరెన్సీలలో కూడా చెల్లింపులు స్వీకరించే అంశాన్ని పరిశీలిస్తోంది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు కలిసి ఉమ్మడి డిజిటల్ కరెన్సీ(సీబీడీసీ)ని వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. సౌదీ ఇప్పటికే చైనాతో స్థానిక కరెన్సీలలో చమురు అమ్మకాలు జరపడానికి ఒప్పందం కుదుర్చుకొంది. భారత్, సౌదీలు కూడా ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోవడానికి సంప్రదింపులు జరుపుతున్నాయి.

## గుండెపోటును గుర్తించిన ఆపిల్ వాచ్.. ప్రాణాలతో బయటపడ్డ బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

వేములవాడ : ఆపిల్ వాచ్ చేసిన అలర్ట్‌తో ముందస్తు గుండెపోటు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ. కొద్దిరోజులుగా ఆయన ఆపిల్ వాచ్ వాడుతున్నారు. ఇటీవల కాలంలో కొంతదూరం నడిస్తే ఆయాసం, ఛాతిలో మంటలా ఉన్నప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు. గుండెకు సంబంధించిన ఇబ్బంది ఉన్నదని, తక్షణమే వైద్యుల సలహా తీసుకోవాలని ఆపిల్ వాచ్ సోమవారం అలర్ట్ చేసింది. అప్రమత్తమైన ఆయన వరంగల్ వైద్యులను సంప్రదించారు.

పరీక్షించిన డాక్టర్లు గుండెకు సంబంధించిన రెండు రక్తనాళాలు మూసుకుపోయాయని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు వెళ్లి వైద్య సేవలు పొందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్,




మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



## త్యాగం, వారసత్వం, పోరాటం రాహుల్ తత్వం..

హైదరాబాద్: ఇవాళ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు. ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్స్‌లో రాహుల్ గాంధీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడటం అతని వ్యక్తిత్వమని పేర్కొన్నారు. వెనుకబడిన వారికి అండగా ఉండాలనేది ఆయన దృక్పథమన్నారు.

త్యాగం, వారసత్వం, పోరాటం ఆయన తత్వమని రాహుల్ అన్నారు. ఆయన తెలివైనవాడని.. భవిష్యత్తు కోసం భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు రాహుల్ అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి రేవంత్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్ : బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం బ్యాంకర్ల వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించి మాట్లాడారు. పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్ అన్నారు. బ్యాంకర్స్‌కు పాజిటివ్ దృక్పథం లేకపోతే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదని పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాలు అందిస్తుందన్నారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమలకు ఎక్కువ రుణాలు ఇవ్వాలి. బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉంది. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చిన విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఉండదని తెలిపారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతోందని స్పష్టం చేశారు.

## త్వరలోనే రాహుల్ ప్రధాని అయ్యే అవకాశాలున్నాయి.. మల్లు రవి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, నితీశ్ మీద ఆధారపడి ఎన్డీయే ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. వాళ్లిద్దరికి కోపం వస్తే ఎన్డీయే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోతుందని తెలిపారు. మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలపై మోదీ ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. తొందరలోనే ఎన్డీయే ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయేలోని చిన్న పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నామని మల్లు రవి తెలిపారు. రాహుల్ త్వరలోనే ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.



## నాణ్యమైన విద్య అందించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం : హరీశ్ రావు




రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు అందించకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ఈ అంశంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. ప్రజా పాలన అని ప్రచారం చేసుకునే ఈ ప్రభుత్వానికి విద్య మీద, విద్యార్థుల భవిష్యత్తు మీద ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని అన్నారు. 422 జూనియర్ కాలేజీల్లో లక్షా 60 వేల మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో మొదటి ఏడాది జీరో అడ్మిషన్స్ నమోదవడం పట్ల ప్రభుత్వం దృష్టి సారించి ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, జూనియర్ కాలేజీల్లో విధులు నిర్వర్తించే 1,654 గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్ రావు వెల్లడించారు.

## అక్కడ కలిసికట్టుగా ముందుకు వెళుతున్న బీఆర్ఎస్, బీజేపీ

వరంగల్: మొత్తానికి ఒక్క విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు కలిసికట్టుగా ముందుకు వెళుతున్నారు. అదేంటంటే.. అవిశ్వాస తీర్మానం వ్యవహారం. వరంగల్ మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సిద్ధమవుతున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి గుండు సుధారాణి వెళ్లారు. ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడి పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన 32 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్ లు, 10 మంది బీజేపీ కార్పొరేటర్లు కలిసి అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. మేజిక్ ఫిగర్ 34 కాగా.. మరో ఒకరిద్దరు కార్పొరేటర్ల కోసం బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు.

తమ పార్టీలోకి వచ్చిన కార్పొరేటర్లను మళ్లీ వెళ్లొద్దని కాంగ్రెస్ నేతలు బుజ్జగిస్తున్నారు. మొత్తం కార్పొరేటర్లు 66 మంది కాగా.. మేజిక్ ఫిగర్ 34. బీఆర్ఎస్ కార్పొరేటర్లు 22 మంది ఉన్నారు. గుండు సుధారాణి బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో హాట్ టాపిక్ అయ్యారు.

అప్పటి నుంచే ఆమె పార్టీని వీడుతారన్న ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి చెక్ పెడుతూ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిద్ధమవుతున్నారు.



## హెడ్ కానిస్టేబుల్‌పై లైంగికదాడి..

### కాళేశ్వరం ఎస్ఐ భవానీ సేన్ అరెస్ట్



జయశంకర్ భూపాలపల్లి : చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారి తన వక్రబుద్ధిని చాటుకున్నాడు. రక్షణ కల్పించాల్సిన పోలీసు భక్షుడిగా మారాడు. తోటి ఉద్యోగినిపై సదరు పోలీస్ అధికారి లైంగిక దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఎస్ఐ భవానీ సేన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రమపై లైంగిక దాడికి పాల్పడంతో బాధితురాలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి డీఎస్పీ కాళేశ్వరం ఠాణాలో విచారణ చేపట్టారు. అర్ధరాత్రి దాటాక విచా రణ ముగియ డంతో ఎస్ఐని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ భవానీ సేన్ పై లైంగికదాడి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కాగా, మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శీనుబాబు అండతో ఎస్ఐ రెచ్చిపోతూ పలు అవినీతి, అక్రమా లకు పాల్పడుతున్నట్లు సమాచారం. పని చేసిన ప్రతి చోటా ఇలాంటి ఆరోపణలు ఎదు ర్కొంటున్నాడని విమర్శలు వస్తున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660